# వెండి పండుగ

మధ్యాహ్నం రెండు కావస్తోంది. భర్త భోజనానికి వస్తాడని ఎదురు చూస్తూ కూర్చుంది అప్పటివాకా. అప్పుడు ఫోనొచ్చింది —ఏదో అర్జంటు మీటింగు ఉందనీ, లంచ్‌కి ఇంటికి రావట్లేదనీ. పొద్దున్న ఇడ్లీలు తిని వెళ్లాడు శ్రీధర్. అతని కిష్టం కదా అని ఆవ పెట్టిన కందకూర, ములక్కాడలు వేసి పప్పుపులుసూ చేసింది.

ఇదివరకు ఆఫీసు దూరంగా ఉన్నప్పుడు ఆఫీసు కేంటీనులోనే భోంచేసేవాడు. ఇంటి నుంచి కేరేజీ పట్టుకెళ్లడం అతనికిష్టం ఉండేది కాదు. ఇప్పుడు ఆఫీసు దగ్గరే. పైగా, కారుంది. అందుకని, ఇంటికే వస్తున్నాడు భోజనానికి. అప్పుడప్పుడు ఏదైనా పనిపడితే రాడు. అతను మధ్యాహ్నం ఇంటికి రావడం మొదలు పెట్టినప్పటి నుంచే ఆమెకి వంట చెయ్యాలంటే ఉత్సాహం పుడుతోంది. కూతురు పెళ్లయి అత్తారింటికి వెళ్లిపోయింది. కొడుకు ఉద్యోగరీత్యా ఢిల్లీలో ఉంటున్నాడిప్పుడు-ఆరు నెలల నుంచీ. ఇక ఇంట్లో ఉండేది తనొక్కర్తే, భర్త ఆఫీసుకి వెళ్లిపోతే.

ఒక్కర్తే టేబుల్ దగ్గర కూర్చుని యథావిధిగా అన్నీ అమర్చుకుని భోంచెయ్యే బుద్ధి పుట్టలేదు. ఒక ప్లేటులో అన్నం, పెరుగూ, కాస్త కూరా వేసుకుని, ప్లేటు తెచ్చుకుని ముందుగదిలో కుర్చీలో కూర్చుని రెండు నిముషాల్లో తినేసి, ప్లేటు సింకులో పెట్టేసి చెయ్యి కడిగేసుకుంది

వచ్చి మళ్లీ కుర్చీలో కూర్చుంది. పేపరు చదవడం అప్పటికే పూర్తయిపోయింది. లెండింగ్ లైబ్రరీ నుంచి తెచ్చుకున్న పత్రిక తీసింది చదువుదామని. చటుక్కున గుర్తుకొచ్చింది ఆ క్రితం సాయంత్రం కొన్న ఆల్బమ్ సంగతి. ఇంట్లో ఆల్బమ్ లేక కాదు కొత్తది కొన్నది. అది పాతది. చిన్నది. తన పెళ్లిలో ఎవరో బహూకరించినది. అందులోనే పెడుతూ వచ్చింది ఫొటోలు పెళ్లయినప్పటి నుంచీ.

అరుణ పెళ్లయి పాతికేళ్లయింది. సరిగ్గా పాతికేళ్లూ ఇంకో వారం రోజుల్లో పూర్తవుతాయి. సిల్వర్ జూబ్లీ ఘనంగా జరుపుకోవాలని ఉరకలు వేస్తోంది అరుణ మనస్సు. పిల్లలిద్దరూ వస్తే బావుండునని ఎంతగానో అనుకుంది. కొడుకు ఉద్యోగంలో కొత్తగా చేరాడు. అదీ ఒక ప్రైవేటు కంపెనీలో. సెలవు తీసుకోవడం కుదరదనీ, 'సారీ మమ్మీ' అనీ రాశాడు. కూతురైనా వస్తుందని ఎంతో ఆశపడింది కానీ వాళ్ల ఆడబిడ్డకి పురిటి రోజులు, 'రావడం కుదరదు, క్షమించమ్మా' అని రాసింది. చూసి, ముందు కొంచెం నిరాశ చెందినా, క్రమంగా మనస్సు కుదుట పరుచుకుంది. క్లోజ్ ఫ్రెండ్స్‌నందరినీ డిన్నర్‌కి పిలిచి, తను కొనుక్కున్న గద్వాల చీర కట్టుకుని, మాచింగ్‌గా కొత్తగా చేయించుకున్న పగడాల గొలుసు వేసుకోవాలనుకున్నాక, మళ్లీ ఉత్సాహం పుంజుకుంది.

భర్త అప్పుడప్పుడు తన కోసం ఏదైనా చీర, నగ కొని పట్టుకొచ్చి బహూకరించాలని ఉంటుంది అరుణకి. కానీ, శ్రీధర్ ఎప్పుడూ ఆఫీసు గొడవల్లోనూ, రీసెర్చ్‌లోనూ మునిగి తేలుతూ ఉంటాడు. ఇంట్లో ఉన్నప్పుడు కూడా అర్ధరాత్రి దాకా పుస్తకాలూ, ఫైల్సూ పుచ్చుకుని కూర్చుంటాడు. ఇల్లు నడిపే బాధ్యత అంతా భార్యమీదే వదిలేవాడు. మధ్య మధ్య సలహాలూ, విమర్శలూ తప్ప అతను చేసేదేమీ ఉండదు. అరుణకేం కావల్సినా, పిల్లలకేం కావల్సినా అన్నీ అరుణే కొనాలి. భర్త ముద్దుగా పట్టుకొచ్చి ఇస్తే తీసుకోవాలనే ముచ్చట ఇంత వరకు తీరలేదు. 'నేను సంపాదించినదంతా నీకే ఇస్తున్నాకదా, ఇంక వేరే ఇచ్చేందుకేముంటుంది? నీక్కావల్సింది నువ్వు కొనుక్కో. నేనుకాదంటానా?' అంటాడు అతను. అరుణ ఏదన్నా కొత్తగా కట్టుకున్నా గుర్తించను కూడా గుర్తించడు. నోరు తెరిచి, 'ఎలా ఉన్నాను. ఇది కట్టుకుంటే' అనో, 'ఎలా ఉన్నాను ఇది పెట్టుకుంటే' అనో అడిగితే నువ్వెలా ఉన్నా బావుంటావు' అని తేలిగ్గా కొట్టి పారేస్తాడు. 'డాడీకి బొత్తిగా రొమాన్స్ తెలియదమ్మా!' అని నవ్వేది కూతురు మాధవి. పైగా, 'ఉట్టి రోబోట్!' అనేది.

రొమాన్స్ సంగతి సరే, ఓ పూజా పునస్కారాలు లేవు, ఓ పిక్నిక్స్ లేవు. మళ్లీ మాట్లాడితే, ఆదివారం పూట కూడా ఆఫీసుకి వెళ్లాలంటాడు. ఆ లేబరేటరీ అతని రెండో భార్య అన్నట్లుగా, అదే ధ్యాసలో ఉంటాడు ఎప్పుడూ. ఆ కొడుక్కి అన్నీ తండ్రి బుద్ధులే వచ్చాయి. తండ్రీ కొడుకుల సబ్జెక్ట్ ఒకటే అవడంవల్ల ఇద్దరూ అన్నదమ్ముల్లా కలిసి చర్చించుకుంటూ ఉంటారు గంటల తరబడి. తల్లీ కూతుళ్ల 'ఆడకబుర్లు' వాళ్ల చెవి కెక్కవు. వీళ్లని వాళ్లూ, వాళ్లని వీళ్లూ 'బోర్' అని వెక్కిరించుకుంటూ ఉంటారు!

అభిరుచులు కలవక పోయినా, అన్యోన్యంగానే సాగింది సంసారం. కొత్త ఆల్బమ్‌లో ఫోటోలు అతికిస్తూ గతస్మృతులలో పడి టైమెంతయిందో కూడా చూసుకోలేదు అరుణ పని మనిషి బెల్ కొట్టే వరకూ సాయం కాలం అయిందన్న సంగతి గ్రహించలేదు. ఒక వైపు పనిమనిషి బాత్ రూమ్‌లో పని చేస్తూంటే మరో వైపు తను వంటింట్లో సాయంకాలానికి టిఫినూ, రాత్రికి భోజనం తయారు చేసే సన్నాహాలు ప్రారంభించింది.

ఇంతలో మళ్ళీ బెల్ మ్రోగింది. 'ఆయనొచ్చేశారా, కారు చప్పుడు కాలేదే, అనుకుంటూ వెళ్ళి వీధి తలుపు తెరిచింది. ఎదురుగా భర్త కాదు. భర్త దగ్గర రీసెర్చి చేస్తున్న కుసుమ అనే అమ్మాయి. కుసుమ అపడప్పుడు తనగైడ్‌తో చర్చించడానికీ, ఆయన సలహాలు తీసుకోవడానికీ ఇంటికి రావడం మామూలే. అయినా, ఆవేళప్పుడు రావడం అరుదు. అయినా సాయంకాలం 5 గంటలైనా కాకుండా ఆయన ఇంటికి వచ్చేస్తారని ఎలా అనుకుని ఉంటుంది! క్షణం సేపు ఆశ్చర్యపోయినా, అరుణ చిరు నవ్వుతో లోపలికి ఆహ్వానించింది కుసుమను.

కుర్చీలో కూర్చున్నాక, 'ఏమిటి విశేషం? ఇవాళ పెందరాళే వచ్చావ్, డాక్టరుగారు ఇంకా రాలేదు కదా' అంది.

'అరె! ఏదో అర్జంటు పర్సనల్ వర్క్ ఉంది, నేను మధ్యాహ్నం ఆఫీసుకి రానని చెప్పారుట పి.ఎ.తో. నేను ఆయన్నొక ముఖ్య విషయంలో సంప్రదించాలి. రెండు రోజుల నుంచీ వీలు కుదరడంలేదు. పోనీ ఇంట్లో దొరకుతారేమోనని, ఈ దారిని వెడుతూ చూసి పోదామని వచ్చానండీ'.

కుసుమ మాటలు వింటూనే, చక్కని సంగీతం మధ్యలో అపశ్రుతులు వినిపించినట్లు అరుణ కనుబొమ్మలు ముడుచుకున్నాయి. మధ్యాహ్నం భర్త ఫోన్‌లో తనతో చెప్పిన మాటలకీ, ఇప్పుడు కుసుమ చెబుతున్న దానికీ పొంతన కుదరలేదు. అయినా ఆ విషయమై అంతగా పట్టించుకోనట్లుగా ప్రసక్తి మార్చింది అరుణ.

కుసుమ కట్టుకున్న చీర మీదికి దృష్టి మళ్ళించింది. ఆరకం చీరల గురించి మాట్లాడుతూంటే, కుసుమ మధ్యలో అందుకుని,

'అన్నట్లు అంటీ, డాక్టరుగారు కొన్న చీర మీకు నచ్చిందా' అంది.

'ఏం చీర?' అంది అరుణ తెల్లబోతూ.

'అదేనండీ మైసూరు సిల్కు చీర! అది మీ పుట్టినరోజు కని తెచ్చారా?' అంది కుసుమ ఉత్సాహంగా.

అరుణకి షాకు తరవాత షాకు! తట్టుకోలేక పోతున్నా, ఎలాగో తమాయించుకుని, 'ఓహో, ఆ చీరా!' అంది ముఖాన వెలవెల బోతున్న చిరునవ్వు ప్రదర్శిస్తూ

కుసుమ మరింత ఉత్సాహంగా చెబుతోంది—'మొన్నా మధ్య ఓ బ్లౌజ్ పీస్ కావలసివచ్చి ఒక షాపులోకి వెళ్ళాను. అనుకోకుండా అక్కడ డాక్టరుగారు కనిపించారు. ఆయనతో మంగళగారు కూడా ఉన్నారు...'

'మంగళ అంటే ఆ మధ్య చేరిన రీసెర్చ్ అసిస్టెంట్ కదూ' అంది అరుణ నీరసంగా.

'అవునాంటీ, ఇద్దరూ కలిసే సెలెక్ట్ చేశారు ఆ చీర. బహుశా మీకు సర్‌ప్రైజ్ ఇవ్వాలనేమో!'

'అవునవును' అంది అరుణ. పైకి ఏ భావమూ వ్యక్తం చెయ్యకూడదని శతవిధాల ప్రయత్నిస్తోంది. లోపల అప్పుడే పెనుతుపాను మొదలైంది. మనసు ఎండుటాకులా రెపరెపలాడుతూ, గాలి విసురుకి ఏ క్షణాన్నైనా రాలిపడేట్లుంది. లేత నీలపు ఆకాశంలో అంతదాకా విరిసిన వెండిమబ్బు మాడిపోయి మసిపూసుకున్నట్లయింది, అంతవరకూ అంతెత్తున తేలియాడిన ఆ తెల్లమబ్బుకి ఆ నల్లముసుగు భారమై, ఏ క్షణాన్నైనా కరిగి నీరై కురవబోతున్నట్లుంది.

అరుణ చటుక్కున లేచింది వంటింట్లోకి వెళ్లేందుకు—కాఫీ తెచ్చే నెపంతో.

'వద్దాంటీ. నాకిప్పుడేంవద్దు, నే త్వరగా వెళ్లి ఛాప్టర్ పూర్తి చేసుకోవాలి. మళ్లీ తీరిగ్గా వస్తాలెండి' అంటూ మరో మాటకి తావివ్వకుండా భుజాన సంచీ తగిలించుకుని లేచింది కుసుమ.

'ఓ.కె' అంది అరుణ మనసులో బ్రతుకు జీవుడా అనుకుని.

ఇప్పుడిక ఎవరితోనూ మాట్లాడాలని లేదు. ఒంటరిగా కూర్చుని ఆలోచించుకోవాలనిపిస్తోంది. పని మనిషిని కూడా పంపించేసి తలుపు గడియ వేసేసింది. వచ్చి బెడ్‌రూములో పక్కమీద వెల్లకిలా పడుకుంది.

కుసుమ చెప్పిన సంగతుల్నీ, మధ్యాహ్నం భర్త చెప్పిన మాటల్నీ పునశ్చరణ చేసుకుంటూంటే ఆశ్చర్యం,అనుమానం, ఆవేదన పోటీలు పడుతూ భ్రమరాల్లా మనసును చుట్టు ముట్టాయి.

'నిజమా? నిజమే అయితే ఏం చేయ్యాలిప్పుడు? నన్ను వదిలేస్తానంటారా?–రెండిళ్ళంటారా?- అంతవరకూ వస్తుందా? ఎదిగిన పిల్లలున్నారు. ఏమనుకుంటారు! వియ్యాల వారికి తెలిస్తే!– ఛీ-నిజమై ఉండదు. యాభై ఏళ్ళు దాటిఛా!- రోబోట్‌కా!- ఏమో? పిల్లల్ని పిలిపిస్తే?–ఛీ మధ్యవర్తుల్లాగ! ఏం చెయ్యడం?–ఇంటర్ మీడియట్ చదివిన దానికి ఉద్యోగం ఎవరిస్తారు? గ్రాడ్యుయేషన్ అయినా పూర్తి చెయ్యాల్సింది- ఓపెన్ యూనివర్సిటీలో చేరితే? అప్పటి దాకా ఎక్కడుండటం?- ఛీ, ఏమిటీ ఆలోచనలు! అసలు నిజమో, కాదో? మరి, ఆయన ప్రవర్తనకి అర్థం? నిజమేనేమో?- పాతికేళ్లు వచ్చినా పటిష్టత లేదా వివాహ సౌధానికి! ఒక్క పిల్లగాలి విసురుకే బీటలు తీసి కూలిపోతుందా?-అలా కూలిపోకుండా నిలిచినందుకే 'వెండి పండుగ' చేసుకుంటారా దంపతులు? ఆపండుగదాటితే ఇక కూలిపోదన్న నమ్మకం ఏర్పడుతుందా?ఇంకసరిగ్గా వారం రోజులుంది పాతికేళ్లు పండే పెళ్ళి రోజు. ఈ వారం రోజులూ ఏమీ ఎరగనట్లుంటే!- ఛీ, ఏ మొహం పెట్టుకుని సిల్వర్ జూబ్లీ చేసుకోడం! అయినా, ఆయనకి గుర్తుందో లేదో-అంతా తన పిచ్చి కాని! ప్రతి ఏడూ తనే గుర్తుచేస్తుంది– 'ఇవాళ మన పెళ్ళిరోజు' అంటూ. ఈసారి ఏమొహంపెట్టుకుని చెబుతుంది 'వెండి పండుగ' అంటూ-వివాహమే దండుగ అవుతూంటే?....'

మంచం మీద నుంచి లేచి, ఎదురుగా ఉన్న నిలువుటద్దంలో ముఖం చూసుకుంది. ముప్ఫయి లంఖణాలు చేసినట్లు పీక్కుపోయింది కను కొలకుల్లోంచి కన్నీటి చుక్కలు వెచ్చగా జారాయి. చెంపలు తుడుచుకుని బాత్‌రూమ్‌కి వెళ్లింది ముఖం కడుక్కుని మామూలుగా ఉండటానికి.

(జ్యోతి 'ఉగాది' ప్రత్యేక సాహిత్యసంచిక, ఏప్రిల్' 89)